రచన - జూన్ 2003

# ఊరుమ్మడి తల్లి

ఏటి ఒడ్డున తమ పొలంలో గట్టుకి ఒకింత దూరంలో ఉన్న రెండు గదుల పెంకుటింటి ముందు వసారాలో వాలుకుర్చీలో కూర్చుని, మామిడితోపు వెనుకనించి అప్పుడే ఆకాశంలోకి ప్రసరిస్తున్న ఉదయ కిరణాల్ని చూస్తున్న శ్రీనివాసు సైకిల్ బెల్ చప్పుడు విని తలతిప్పి చూశాడు. ఓబులేశు సైకిల్ స్టాండ్ వేసి, వసారా పక్క మెట్ల మీద నుంచి పైకి వచ్చి, దారిలో అయ్యరు హోటల్లో కట్టించిన యిడ్లీల పొట్లాన్ని, నింపుకొచ్చిన కాఫీఫ్లాస్కునీ, ఆ రోజు దినవార్తాపత్రికని, పక్కనే ఉన్న బల్ల మీద ఉంచి, "దండాలయ్యా" అన్నాడు. ఆ తర్వాత ఓబులేశు లోపలికి వెళ్ళి ఓ చిన్న స్టీలు గ్లాసు తీసుకువచ్చి, అందులో కాఫీ నింపి శ్రీనివాసు కందించాడు.

శ్రీనివాసు కాఫీ త్రాగేవరకూ ఆగి, "ఈ మాట విన్నారా శ్రీనివాసబాబూ?!" అన్నాడు ఓబులేశు.

"నిన్న రాత్రి నువ్వు ఖాళీ కారియర్ ఇంటికి పట్టుకుపోయిన తర్వాత, ఓ అరగంట ఏదో పుస్తకం చదివి పడుకున్నాను. అర సీసాడు నాటుసారా లాగించి తోడుపడుకొన్న స్వామి, అరగంట క్రితమే లేచి తూర్పువార పంటకాల్వలో మట్టి తీయ్యడానికి పారా, పలుగూ పట్టుకొని పోయాడు. ఈలోపుగా ఏ మాట, ఎవరి ద్వారా వినగలను?" - శ్రీనివాసు చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"సానివాడలో నిన్న రాత్రి రెండింటికి నీలవేణి కన్ను మూసిందయ్యా!" అన్నాడు ఓబులేశు.

శ్రీనివాసు ఓక్షణం స్తబ్దుడైపోయాడు.

"ఆమె అంత రాత్రివేళ పోయినట్టు నీకెలా తెలిసింది? రాత్రి నీ ఇంటికి వెళ్ళకుండా ఆ వాడలో ఎక్కడైనా కాని పక్క వేశావేమిటి?!! ఎందుకైనా మంచిది, జాగ్రత్తగా ఉండు. లేనిపోని రోగాలొచ్చాయంటే ఆరోగ్యం దెబ్బతింటుంది" అన్నాడు మందలింపుగా, స్తబ్ధతలోంచి

తేరుకుంటూ.

ఆ మాటలకి ఓబులేశు నొచ్చుకోలేదు.

"మీరు ఆవలిస్తే పేగులు లెక్కడ్తారయ్యా! క్రితం ఏడు మరిడమ్మ సంబరాల ఆఖరి రోజున సాముగరిడి తిప్పినప్పుడు, నా కండబలం చూసిన గడసాని కనకం కన్ను గీటిందయ్యా! అప్పట్నుంచీ దాని గడపలో నెలకోసారి అడుగుపెడ్తున్నానయ్యా! మీదగ్గిర దాపరికమెందుకు?" అన్నాడు ఓబులేశు కాస్త చనువుగా, చొరవగా.

"అందుకే అంటున్నాను, నేరుగా అఘోరిస్తున్నావా లేక జాగ్రత్తలేమైనా తీసుకొంటున్నావా అని?" - శ్రీనివాసు కాస్త స్వరం హెచ్చించి అన్నాడు.

"రోగ నిరోధకానికి పనికొచ్చే వాటిని వాడుతున్నానయ్యగారూ! అవి వాడితే ఎయిడ్స్ లాంటి మహమ్మారి వ్యాధులు కూడా రావని తెగసందేశాలిచ్చేస్తున్నారు కదా సార్?!

"దౌర్భాగ్యమేమిటంటే, కుటుంబ నియంత్రణకి ఉపయోగించే ఈ సాధనాన్ని సుఖరోగ నివారణ సాధనంగా ప్రభుత్వాలూ, తయారీ కంపెనీలూ ప్రకటనలహోరు పెంచేయడం మూలాన, నీ లాంటి వాళ్ళు ఈ రెండో అంశానికే ప్రాముఖ్యత ఇచ్చేస్తున్నారు! నీ కిప్పటికే ముగ్గురు పిల్లలు, నాలుగో కానుపుకి నీ భార్యని పుట్టింటికి పంపించి, రాసలీలల్లో మునిగితేలితున్నావన్న మాట! ఓబులేశూ, నువ్వు రోగం రాకుండా చూసుకుంటున్నావేమో కాని దేశానికి జనాభా రోగాన్ని పెంచేస్తున్నావన్నమాట మరిచిపోకు! అయినా నీ కిదేం బుద్ధి ఓబులేశూ?"

"నాకు కట్టబెట్టిన ఆడది చూపులకి చీపురుపుల్లలా ఉన్నా, అది పెట్టే నస సంగతి నాకు తెలుసు, ఆ దేముడికి తెలుసు. కనకం పొందులో నాతీరని కోరికలు తీరుతున్నాయి అయ్యగారూ!" - ఓబులేశు తన ప్రవర్తనకి కారణం చూపుతూ సమర్థించుకోబోయాడు.

"ఇదే విధంగా ఆలోచించి, కట్టుకొన్న స్త్రీ కూడా పక్కదారులు చూసుకొంటే సమర్థించే ధైర్యముందా నీకు?" - శ్రీనివాసు అన్యమనస్కంగా అన్నాడు.

ఓబులేశు సమాధానమివ్వకుండా నేల చూపులు చూడసాగాడు.

నీలవేణి మరణవార్త విన్న తర్వాత ఓబులేశుతో ఏవో మాటలు మాట్లాడుతోన్నా, శ్రీనివాసు హృదయంలో సుడిగుండాలు తిరుగుతున్నాయి. ఉన్నట్టుండి కుర్చీలోంచి లేచి, "ఓబులేశూ, స్వామిని పిలు" అన్నాడు.

ఓబులేశు రెండు చేతుల చూపుడు వేళ్ళనీ పెదాల మధ్య బిగించి ఈల వేశాడు. దూరంగా ఉన్న స్వామి పార విడిచి పరుగెత్తుకొంటూ వచ్చాడు.

"స్వామీ, దక్షిణం వైపు ఎండిపోయి ఉన్న రెండు తుమ్మచెట్లనీ నరికించి, వెంటనే పుల్లల్ని ఏటి వంపులో ఉన్న శ్మసానానికి చేర్పించే ఏర్పాట్లు చెయ్యి. అక్కడ యిద్దరు మనుష్యులతో సిద్ధంగా ఉండు. మరో నలుగురు మనుషుల్ని సానివాడలో నీలవేణి ఇంటి దగ్గరకు పంపించు. ఓబులేశూ, నువ్వు సైకిలు మీద నీలవేణి ఇంటికి త్వరగా వెళ్ళి, ఆమె పెంపుడు కూతుళ్ళతో నేనక్కడికి వస్తున్నాని కబురు చెప్పు. ఆ తర్వాత మా పురోహితుడు అవధాని ఇంటికి వెళ్ళి,

శ్రాద్ధకర్మలు చేసే బ్రాహ్మలతో నీలవేణి ఇంటికి వెంటనే రమ్మని చెప్పు" - దూరంగా పైకి లేస్తున్న సూర్యుడి వెలుతుర్లో నీడలు కల్పిస్తున్న చెట్లకేసి చూస్తూ శ్రీనివాసు అన్న మాటలకు ఓబులేశు, స్వామి విస్తుపోయారు.

ఓబులేశు తేరుకొని, "అయ్యగారూ, తమరు....?" అని అర్థాంతరంగా ఆగిపోయాడు.

"వెళ్ళండి, వెళ్ళి చెప్పిన పనులు చెయ్యండి. స్వామీ, ఈ ఇడ్లీల పొట్లాం నువ్వు పట్టుకుపోయి తిను. ఓబులేశూ, నువ్వక్కడికి పోయి ఏర్పాట్లు చేస్తూఉండు. నేనో గంటలోగా అక్కడికి వస్తాను" అన్నాడు శ్రీనివాసు కాస్త తీవ్రంగా.

ఓబులేశు వసారాలో ఉన్న మోటారు సైకిల్ని కిందకు దింపి స్టాండ్ వేశాడు. అటు పైన తన సైకిల్ని తీసుకొని ఊళ్ళోకి వెళ్ళాడు.

శ్రీనివాసు ఓ అరగంట సేపు కళ్ళు మూసుకొని, రాబోయే తుపానునెలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తు కూర్చుండి పోయాడు. ఆ తర్వాత లేచి బట్టలు మార్చుకుని, మోటారు సైకిలు మీద సానివాడ చేరుకొని నీలవేణి ఇంటి గుమ్మం దగ్గర ఆగాడు.

శ్రీనివాసు సానివాడ చేరుకొనేసరికి ఊరంతా ముక్కు మీద వేలేసుకొంది. దారినపొయ్యే దానయ్యలు గుమిగూడారు. నీలవేణి పెంపుడు కూతుళ్ళు శ్రీనివాసుని చూస్తూనే అయోమయస్థితిలో పడిపోయారు. నీలవేణి ఇంటి అరుగు మీద కూర్చున్న ఆ వాడ స్త్రీలందరూ లేచి నమస్కారం చేసి, క్రిందకు దిగారు.

నీలవేణి పార్థివ శరీరం చాపమీద పడుకోపెట్టబడి ఉంది. తల దగ్గర దీపం మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది. మహానిద్రలో ఉన్న ఆ మంజిక ప్రశాంత వదనంలో అరవై అయిదేళ్ళ అనుభవాల విషాద ఛాయలు శాశ్వతంగా మరుగునపడి పోయాయి. శ్రీనివాసు మోకాళ్ళ మీద వంగి, ఆమె పాదాలపై శిరస్సు నుంచి పాదాభివందనం చేశాడు.

ఓబులేశు అరుగు కింద చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

అవధాని అరుగెక్కి శ్రీనివాసు పక్కగా నిల్చుని, "శ్రీనివాసూ, నువ్వు బాగా ఆలోచించే ఈ కార్యక్రమం తలపెట్టావనుకుంటాను. అయిన వారూ, కాని వారూ ఏ విధంగా స్పందిస్తారో ఆలోచించావా?" అని నెమ్మదిగా అన్నాడు.

"ఈ కర్మకాండలు చేయించడానికి ముందస్తుగా మీకేమైనా అభ్యంతరం ఉంటే చెప్పండి, నా సంగతి తర్వాత ఆలోచిద్దురుగాని!" - శ్రీనివాసు తగ్గుస్వరంలోనే అన్నా, ఆ మాటల్లో తీవ్రత ఉంది.

అవధాని సమాధానం చెప్పడానికి తటపటాయించి మౌనంగా ఉండిపోయాడు.

శ్రీనివాసే మళ్ళీ అన్నాడు - "ఈ ఇంట్లో ఓ పూజగది ఉంది. అందులో లేని దేవతల పటాలు లేవు! ఇలాంటి జీవితాలు గడుపుతూ కూడా కర్మఫలమని సమాధానపర్చుకొంటూ, మన ధర్మాల మీద విశ్వాసం పోగొట్టుకోలేదు వీళ్ళు! అయినా అవధానిగారూ, అనాథప్రేత సంస్కారమంతటి పుణ్యం మరొకటి లేదని శాస్త్రాలే చెబుతున్నాయి కదా?"

అవధాని లౌక్యుడు. నాలుగు రాళ్ళు వదులుకొనే మూర్ఖుడు కాదు.

"నువ్వన్న మాట నిజమే కాని, నీలవేణి అనాధ కాదు! చాలా ధనం సంపాదించింది. కర్మకాండలు జరిపించడానికి నా కభ్యంతరం లేదు కాని, నువ్వే స్వయంగా నడుం బిగించడం చాలామందికి అభ్యంతరకరంగా ఉండొచ్చు, నీ మీద బురద జల్లడానికి ప్రయత్నాలు జరగవచ్చు. నేను భయపడేదీ, ఆలోచించేదీ నీ గురించే!" అన్నాడు.

"డబ్బుంటే ఉండొచ్చు, కాని 'నా' అంటూ కన్నీరు కార్చే ఓ తండ్రి కాని, భర్త కాని, కొరివి పెట్టే కొడుకు కాని లేని వీళ్ళు వాస్తవానికి అనాధలే. సరే, ఇప్పుడీ వాదనలన్నీ ఎందుకు కాని, శాస్త్రోక్తంగా కర్మకాండలన్నీ నాచేత జరిపించండి. మీ మీద ఈగ వాలనివ్వకుండా చూసే బాధ్యత నాది. నా విషయం గురించి మీరు పట్టించుకోవద్దు".

ఓబులేశుతో తగ్గ స్వరంలో మాట్లాడుతోన్న కనకం, అరుగు మీద జరుగుతున్న సంభాషణ వైపు ఓ చెవి పారేసి మరీ వింటోంది. కనకం ఒక్క క్షణం ఆలోచించి అరుగు మెట్లెక్కింది. శ్రీనివాసు దగ్గరగా వెళ్ళి, "అయ్యగారూ, మీరిద్దరూ ఓసారి ఈ ఇంటి పూజగది చూస్తే బావుంటుంది! అవధానిగారి అనుమానాలు తీరిపోతాయి!" అంది వినయంగా. 'సరే, పద' అన్నట్లుగా చూసిన శ్రీనివాసునీ, అవధానినీ ఇంటి లోపలి పూజాగృహంలోకి తీసుకెళ్ళింది కనకం.

దేవతల పటాల మధ్యలో శ్రీనివాసు తండ్రి మాధవరావు పటం! మంచిగంధపు చెక్కలతో చెక్కిన పువ్వుల దండతో అలంకృతమైంది. శ్రీనివాసూ, అవధానీ ఇద్దరూ ఆశ్చర్య పోయారు. 'ఈ కార్యక్రమం ధైర్యంగా జరిపించే శక్తి నివ్వు' అని మౌనంగా తండ్రి పటానికి నమస్కరించి, బయటకు దారి తీశాడు శ్రీనివాసు.

అప్పటికి శ్రీనివాసు తమ్ముడు ప్రసాదూ, మరికొంతమంది స్నేహితులూ అక్కడికి చేరుకొన్నారు. ప్రసాద్ అన్న దగ్గరగా వెళ్ళి, "ఊరంతా ఈ వార్త గుప్పుమంది. ఇంటి దగ్గర అమ్మ నిప్పులు చెరుగుతోంది. ఒంటి కాలు మీద నిల్చుని రంకెలు వేస్తోంది. నిన్ను ఉన్నపళంగా వచ్చెయ్యమనీ, లేకపోతే తనేంచేస్తుందో తనకే తెలియదనీ హెచ్చరించమని చెప్పింది" అని అప్పజెప్పినట్లన్నాడు.

"ఆస్తిలో వాటా ఇవ్వనంటుంది, అంతకంటే ఏం చేస్తుంది?! నా మూలాన నువ్వు నష్టపడ్డం ఎందుకు? ఇంటికి పోయి స్నేహితులతో ఉండు. ఏం జరిగేదీ నేనింటికొచ్చిన తర్వాత చూసుకొంటాను" అన్నాడు శ్రీనివాసు నిశ్చలంగా.

అన్నకి తోడుగా ఉండాలని ప్రసాద్ కనిపించినా, 'తగుదునమ్మా అని మీ అన్నగారి వెనుక వెళ్తే, మీ అమ్మగారు మొండి చెయ్యి చూపించవచ్చు. సంతులేని ఆవిడ మేనత్త దగ్గర్నుంచి సర్వహక్కులతోనూ సంక్రమించిన ఆస్తిని మీ అక్కచెల్లెళ్ళు ఎగరేసుకుపోతారు! ఏదో అంటీముట్టనట్టుగా కబురు చెప్పి వచ్చెయ్యండి' అన్న భార్య హెచ్చరిక మనసులో మెన్నాడుతోండగా, శ్రీనివాసు ఆ మాట అనడం తడవు వచ్చిన స్నేహితులతో తిరిగి వెళ్ళిపోయాడు.

అవధాని అధ్వర్యంలో శ్రీనివాసు నిప్పుకుండ తీసుకొని వెళ్ళగా, నీలవేణి అంతిమయాత్ర దర్జాగా సాగింది. ఇళ్ళలోంచి బయటకు వచ్చిన జనాలు విడ్డూరంగా చూస్తూ ఉండిపోయారే కాని, శ్రీనివాసుతో ఒక్కడుగు కలిపి ఎవ్వరూ వెయ్యలేదు. వాళ్ళలో సానివాడను రాత్రి ముసుగులో దర్శించే ఘనులు లేకపోలేదు.

ఏటి ఒడ్డున నీలవేణి శరీరానికి దహనకాండలు జరిపి, శ్రీనివాసు ఇల్లు చేరేసరికి మధ్యాహ్నం రెండు దాటింది. శ్రీనివాసుతో బాటు ఓబులేశూ, అవధానీ కూడా వెళ్ళారు. అవధానికి మనసులో భయం భయంగా ఉన్నా, శ్రీనివాసుకి లేని భయం తనకెందుకని సర్దిచెప్పుకున్నాడు.

శ్రీనివాసు ముందు హాల్లోకి అడుగు పెట్టేసరికి, తల్లి సుందరమ్మ అందరి ముందూ ఏదో ఏకరువు పెడ్తోంది. వాళ్ళలో ప్రసాద్ స్నేహితులూ, శ్రీనివాసు స్నేహితులూ, బంధువులూ వున్నారు. ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకొంది, శ్రీనివాసు ప్రవేశంతో, ఓ పాతకాలపు కర్ర కుర్చీలో కూర్చున్న సుందరమ్మ ఆగ్రహంతో వణికిపోతూ, "బ్రతికుండగా ఆ సానిదాన్నుంచుకొని మీ నాన్న సహమూ, ఇప్పుడు దాని తలకింద కొరివి పెట్టి నువ్వు పూర్తిగానూ ఈ వంశగౌరవాన్ని నట్టేట్లో ముంచేశారు! ఇంకా ఏం మిగిలిందని ఈ ఇంట్లో అడుగుపెట్టావ్?!" అని గట్టిగా అరిచింది.

తన తల్లి అందరి ముందూ పంచాయతీ పెడ్తోందని గ్రహించిన శ్రీనివాసు ఆ క్షణంలో ఓ తెగింపుకు వచ్చేశాడు.

"సుందరమ్మగారు మీ అందరి ముందూ ఓ ప్రశ్న వేశారు. దానికి నేను సమాధానం చెప్పేవరకూ మీరెవరూ ఇక్కణ్ణుంచి కదలడానికి వీల్లేదు. ఓబులేశూ, హాలు తలుపులు ముయ్యి!" అన్నాడు.

ఓబులేశు హాలు తలుపు మూసి గడియ వేశాడు.

"చూశారా, చూశారా? నన్ను పేరు పెట్టి...."

తల్లి సుందరమ్మ మాటల్ని మధ్యలోనే ఆపుచేశాడు శ్రీనివాసు – "సరే 'అమ్మా' అనే అంటాను. కాని నా సమాధానం వినే వరకూ నోరెత్తకు! అమ్మా అని పిలిపించుకొనే అర్హత కూడా నీకెందుకులేదో, ఇంకా ఏం మిగిలిందని ఈ ఇంట్లో నే అడుగు పెట్టకూడదో – రెండింటికి సమాధానం దొరుకుతుంది!"

శ్రీనివాసు చాలా తీవ్ర స్వరంలో అన్న మాటలు విని సుందరమ్మ కంగుతింది. ఏదో అనబోయింది కాని, ఆ మాటలు గొంతులోనే ఉండిపోయాయి. ప్రసాద్ వింతగా అన్న వైపు చూస్తూ ఉండిపోయాడు.

"మాకు ఊహ తెలిసినప్పట్నుంచి ఈ ఇంట్లో నీ మాటొక్కటే చెల్లుతుందనీ, అందరూ నీ కనుసన్నల్లోనే మెలగాలని గ్రహించక తప్పలేదు. అధికారపూర్వకమైన ఓరకమైన అహంభావంతో ప్రవర్తించే నీ తీరు చాలాసార్లు మా మనస్సుల్ని కష్టపెట్టినా, 'తల్లి' అనే గౌరవంతో మౌనంగా ఉండక తప్పలేదు. నీ దాష్టికాన్ని నాన్నగారు ఎందుకు సహించారో, ఎందుకు మౌనంగా

ఉండిపోయారో నా కర్థంకాని విషయంగానే ఉండిపోయింది.

"మీ స్కూలు నిర్వహించే విహారయాత్రలలో పాల్గొనండి. కొత్త స్థలాలు చూడ్డం, సంగతులు తెలియడం, అనుభవాలు సంపాదించడం జరుగుతుందని నాన్నగారు ప్రోత్సహించినప్పుడు, నువ్వు కాదనే దానివి. 'చిన్న క్లాసుల్లో అంత ఖరీదైన పెన్ను ఎందుకు, పారేసుకుంటా'రని నాన్నగారు సలహా ఇచ్చినప్పుడు 'వాళ్ళకేంతక్కువొచ్చిందని? ఎత్తుగా ఆలోచించలేని మనుషులు' అని నువ్వు ఎద్దేవా చేసి, ఖరీదైన కలాల్ని కొనివ్వడం, వారం రోజులు తిరక్కుండానే వాటిని పోగొట్టుకొన్నప్పుడు, 'మీ నోటి ఉసురే తగిలిందని' నువ్వు నాన్నగారి మీద విరుచుకు పడపడం – ఇలాంటి ఎన్నో చెరగని ముద్రల్ని మా మనసుల మీద వేశావు.

"నేను ఆరో క్లాసు చదువుతోన్నప్పుడు ఓ అట్లతద్ది రాత్రి, అందరూ పడుకొన్న తర్వాత మెల్లిగా లేచి వెళ్ళి, నా స్నేహితుల గుంపుతో చేరి ఊరి వీధుల్లో తిరిగాను, గుమ్మాల దగ్గర పల్లేరుకాయలు జల్లడం – తలుపుల మీద తట్టడం – ఇంటి వాళ్ళు తలుపులు తీసి పల్లేరుకాయల మీద అడుగులు వేసి 'కుయ్యో'మనడం – పిల్లలు దూరంగా పరుగెత్తి సంతోషంతో చప్పట్లు కొట్టడం – ఈ చిలిపి పనులు లేనిదే అట్లతద్ది రాణించదని అందరికీ తెలుసు. ఆ రాత్రి నీలవేణి ఇంటి దగ్గర చేసిన ఈ రకం అల్లరిలో నేను కాలుజారి మెట్ల మీద నుంచి పడిపోయాను. వళ్ళంతా పల్లేరుకాయలు గుచ్చుకొన్నాయి. నుదుటి మీద చర్మం చిట్లి రక్తం కారడం మొదలు పెట్టింది.

"తలుపు తీసిన నీలవేణి, 'అయ్యో, పడిపోయావా బాబూ' అంటూ నన్నెత్తుకొని లోపలికి తీసుకువెళ్ళింది. స్నేహితులనందర్నీ లోపలికి పిలిచింది. నన్ను ఉయ్యాల బల్ల మీద కూర్చోపెట్టి, గుచ్చుకొన్న పల్లేరుకాయల్ని ఒకటొకటిగా తీసింది. నుదుటి మీద గాయాన్ని నీళ్ళతో కడిగి పట్టీ వేసింది. 'రాత్రి పూట ఎక్కడెక్కడ తిరిగారో? గాలి దెయ్యాలు పట్టుకొంటే ప్రమాదం కదూ? అందరూ పూజ గదిలోకి వెళ్ళి దణ్ణం పెట్టుకోండి' అని మా అందరి చేతా దణ్ణాలు పెట్టించింది. అందరి నొసట్లకీ విభూతి పెట్టి, 'జాగ్రత్తగా ఆడుకోండి' అని మా గుంపుని సాగనంపింది.

"తెల్లవారి ఇల్లు చేరినప్పుడు రాత్రి బయటకు వెళ్ళినందుకూ, దెబ్బలు తగలించుకొని వచ్చినందుకూ నువ్వు చేసిన గొడవా, పిల్లల సరదాలని సమర్థించబోయిన నాన్నగారి మీద గొంతు చించుకున్న తీరూ ఈ రోజు వరకూ నేను మరిచిపోలేదు. ఆ రోజున నా మనసులో నిన్నూ, నీలవేణిని బేరీజు వేసుకోక తప్పలేదు. నువ్వు జన్మనిచ్చిన తల్లివే కావొచ్చు. ఆ భావనతో బహుశా ఓ రక్షణాత్మకమైన అధికారాన్నే చెలాయించావు కాని, ప్రేమని పంచి యివ్వలేదు. నీలవేణి వేశ్యే కావచ్చు, కాని ఆమెలో ఓ తల్లి హృదయముంది.

"దాంపత్య జీవితానికి సంబంధించిన విశ్లేషణల్ని పుస్తకాల్లో చదివితే సబబుగా ఉంటుంది కాని, కన్న సంతానం తల్లిదండ్రుల ఎదుట ఈ విశ్లేషణల్ని కొనసాగిస్తే అది సభ్యతగా ఉండదు. కాని సమయం, సందర్భం వచ్చాయి కాబట్టి చెప్పక తప్పటల్లేదు.

"వివాహానికి పూర్వమూ లేదా భాగస్వామిని మృత్యువు కాటేసినప్పుడు స్త్రీపురుషులు అక్రమ సంబంధాల వైపు పరుగులు తీశారంటే, అది కుతూహలంతో కూడిన తొందరవల్ల కావచ్చు. లేదా దాంపత్య జీవితంలో లభించిన సుఖం కోసం మనసు మళ్ళీ మళ్ళీ పరుగులు తీయడంవల్ల కావచ్చు. కానైతే, సంఘం ఆమోదించిన వైవాహిక బంధంలో ఉన్న స్త్రీ పురుషులు పెడదారులు పట్టడానికి కారణాలనేకం ఉండొచ్చు. అయిష్టంగా జరిగిన వివాహం - శృంగారపరమైన అసంతృప్తి - వ్యక్తిత్వ ప్రదర్శనలో తీవ్రమైన అభిప్రాయభేదాలు - ఇవి అక్రమ సంబంధాలకి పరుగులు తీయించనూ వచ్చు, విడాకులకి దారితీయనూవచ్చు. కాని నాన్నగారి విషయంలో జరిగిందేమిటి?

"మీ దాంపత్యబంధంలోని యితరమైన అపశృతులు నాకు తెలియవు కాని, నాకు తెలిసినదీ, తెలుపబడ్డదీ అయిన కారణం విను. అయిదు సంవత్సరాల క్రితం, అప్పటికి శ్రీనగర్‌లో ఉన్న నాకు నాన్నగారో ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరంలోని సారాంశం చెప్తా విను.

"అంతకు పూర్వం పదిహేను సంవత్సరాల క్రితం - అంటే నేను కొత్తగా ఉద్యోగంలో చేరి మద్రాసులో ఉన్నప్పుడు, ఇక్కడ మనింటికి నాన్నగారి అహ్వానం మీద అత్తయ్యలిద్దరూ వాళ్ళ భర్తలతో, పిల్లలతో ఓ వారం రోజులు సరదాగా గడపడానికి వచ్చారు. నిన్నడగకుండా పిల్చినందుకు నాన్నగారినీ, వచ్చినందుకు వాళ్ళనీ నువ్వు చాలా అవమానపరిచావు. వాళ్ళు వచ్చిన మర్నాడే తిరిగి వెళ్ళిపోయారు.

"మాపట్ల నువ్వు నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించినా, 'తల్లి, అనడానికి హక్కుంది', అని సర్దుకుపోయే నాన్నగారు తన తోబుట్టువుల్నీ, బావగార్లనీ నువ్వు అవమానించడంతో చాలా తీవ్రమైన మనోక్షోభకి గురయ్యారు. ఆ విరక్తిలో ఏటిగట్టుకి వెళ్లి వరద నీటిలో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకొనే సమయంలో, ప్రేమించిన వ్యక్తి మోసంచేసి పారిపోగా, మారుటి తల్లి బలవంతంగా పడుపు వృత్తిలోకి నెట్టగా, ఆ వృత్తి చేసి చేసి అలిసిపోయి, జీవితం మీద విరక్తి పొందిన నీలవేణి కూడా ఏటిగట్టునే అదే ప్రయత్నంలో ఉండి, ఒకరినొకరు కలుసుకోవడం కేవలం యాదృచ్ఛికం. ఇద్దరూ ఆ ప్రయత్నం నుంచి విరమించుకొన్నారు. అటుపైన ఆధ్యాత్మికచింతనతో, శాంతిప్రవచనాలతో మనసులు కుదుటపరుచుకున్నారు.

"నాన్నగారి ప్రోద్బలంతో ఇరువురు పేదబాలికలను పెంచసాగింది. వాళ్ళని స్కూల్లో చేర్పించింది. వాళ్ల జీవితాలకో వెలుగుబాట చూపించడానికి కంకణం కట్టుకొంది. నాన్నగారికీ, నీలవేణికి ఏ విధమైన శారీరక సంబంధమూ లేదు. ఇంట్లోని ఉరుముల్నీ, ఊరివాళ్ళ నొసటి వెక్కిరింతల్నీ చిరునవ్వుతో స్వీకరించడం నేర్చుకొన్నారు నాన్నగారు. ఎవరికీ తెలపని ఈ నిజాన్ని నాన్నగారు నాకా ఉత్తరం వ్రాసి తెలియజేశారు. ఆ ఉత్తరం నా కందిన అయిదో రోజునే నాన్నగారు పోవడం, నేను రావడం జరిగింది. ఈ అయిదు సంవత్సరాలూ ఈ విషయాన్ని నేనెవరితోనూ చెప్పలేదు.

"ధనమదం, అహంకారం, అధికారం ఈ మూడు నీ మనసుకి పొరలు కమ్మేశాయి.

నాన్నగారిని ఏటిఒడ్డుకు తరిమింది నువ్వు! నాన్నగారు నిత్యమూ నీలవేణి సాన్నిధ్యాన్ని కోరుకోవడానికి కారణమూ నువ్వే! మనం నాన్నగారి ఫొటో ఈ హాల్లో ఆ గోడకి వ్రేలాడదీశాం. కాని నీలవేణి నాన్నగారి ఫొటోని పూజా మందిరంలో ఉంచుకొని పూజించింది! ఆమె వ్యక్తిత్వం నీకన్న చాలా ఉన్నతమైనది. అందుకే ఆమెకి తలకొరివి పెట్టడం ఓ పుత్రధర్మంగా, ఓ అదృష్టంగా భావిస్తున్నాను. ఇక మీరందరూ ఏ కొరివితో తలగోక్కున్నా నాకు లెక్కలేదు!

"మరోమాట - స్వేచ్ఛ, నాగరికతల పేరిట జరిగే వ్యభిచారానికి నేను భాష్యం చెప్పలేను కాని, పొట్టకూటికి ఆ సానివాడల్లో, మహానగరాల మురికికూపాల్లో పడుపువృత్తి సాగించే ప్రతి స్త్రీ కథా ఒక దీనగాథే! ప్రతి స్త్రీ జీవితమూ ఓ నరకమే! దీనికి బాధ్యులెవరూ అంటే మన సమాజమే! గత తరం పెద్ద మనుషులకి వాళ్ళు వెలయాలులైతే, మన తరం వాళ్ళకి వాళ్ళు ఊరుమ్మడి తల్లులు! ఒక్క నీలవేణి విషయంలోనే కాదు, ఇక ముందు ఆ వాడలో ఏ వారకాంత మరణించినా, ఆమె అంతిమయాత్ర విషయంలో నా సహాయం ఎప్పుడూ ఉంటుంది. మీరూ నడుం కట్టండి!!"

మళ్ళీ అంతా నిశ్శబ్దం, ఈ మాటు ఓబులేశు నోరు విప్పాడు.

"అయ్యగారు మా బాగా సెలవిచ్చారు!"

"సుశీలా, బట్టలు సర్దు, మరో పదిహేను రోజులు సెలవు పొడిగించమని మా ఆఫీసుకి బెంగుళూరు ఫోన్ చేశాను. పన్నెండోరోజు వరకూ నీలవేణి ఇంట్లో ఉండి అన్ని ఏర్పాట్లు చెయ్యాలి, ఆమె పెంపుడు కూతుళ్ళని - సారీ - నా చెల్లెళ్ళని హాస్టల్లో చేర్పించాలి. ఓబులేశూ, ఆటో పిలు" అన్నాడు శ్రీనివాసు.

అందరూ తననే గమనిస్తున్నారని సుందరమ్మ గ్రహించింది. ఆమె ముఖంలో యిప్పుడు అధికారదర్పం లేదు. కంటిచూపుల్లో ఆగ్రహం లేదు. కుర్చీలోంచి లేచి, "సుశీలా, నా బట్టలు కూడా సర్దు, మీతో బాటు నేనూ నీలవేణి ఇంటికి వచ్చి, దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేయిస్తాను. అవధానీ, పన్నెండో రోజున పెద్దకర్మ ఘనంగా జరగాలి, శీనూ, నీలవేణి కూతుళ్ళు హాస్టల్లో ఉండవలసిన అవసరం లేదు. వాళ్ళు నా దగ్గరే ఉంటారు. దేశమంతటి సంగతీ నేను చెప్పలేను కాని, ప్రస్తుతానికి మన ఊరికి సంబంధించినంత వరకూ ఏ ఆడదీ పొట్టకూటికి పడుపువృత్తిలోకి దిగకుండా నా శాయశక్తులా పని చేస్తాను. ఏ ఆస్తులైతే నా మనసుకి పొరల్ని క్రమ్మాయో వాటిని ఈ విషయమై సద్వినియోగం చేస్తాను" అంది ఓ దృఢనిశ్చయంతో.

ఆ ఉదయం మామిడితోపుల వెనక వెలుగురేఖల్ని చూసిన శ్రీనివాసు, ఇప్పుడు తల్లి సుందరమ్మ నేత్రాల్లోంచి వెలువడుతున్న మాతృకిరణాలను చూడసాగాడు.

• • •

పేరేదైతే కానీండి, ఆ ఊరొక్కప్పుడు చాంతాళ్ళకీ, సిల్కుకీ, సానులకీ ప్రసిద్ధి. ఇప్పటికీ ఆ ఊరి శివార్లలో ఉన్న ఏటివంపులో రెండు సమాధులు పక్క పక్కనే ఉన్నాయి. ఒకటి నీలవేణిది, మరొకటి సుందరమ్మది. •